# పాపం, మా ఆవిడ sick leave అయిపోయింది!

--మూర్తి భావరాజు, Parsippany, NJ

'రాత్రి భోజనం ఏం చేస్తావు? ప్రభ సాంబారు, సుధ వంకాయ కూర, అన్నం. లేకపోతే చంద్రిక చేసిన రవ్వ ఇడ్లీ-కొబ్బరి పచ్చడి, ఇందిర నిమ్మకాయ , రజిత చారు అయితే లైట్‌గా ఉంటుంది. ఇవేమి వద్దనుకుంటే మీ ఆఫీసు వాళ్ళు పంపిన ఫ్రూట్ బాస్కెట్‌లో రకరకాల చిరుతిండి ఉంది తినటానికి' అనడిగాను మా ఆవిడని. ఇది నాలుగు వారాల క్రితం జరగుతోన్న ధోరణి. మరోక రోజు మరో వంటలు... మరో పేర్లు!

ఇల్లాగ రోజు ఎవరో చేసిన వంటలు మైక్రోవేవ్‌లో వేడి చేసికొని ఇంట్లో వంట చేసుకోకుండా రోజులు గడుపుతున్నాం అంటే మరీ మేము 'వారాలు' చేసుకునేవాళ్ళం కాదు. మా ఆవిడకి సర్జరీ అయితే, కొన్ని వారాలు విశ్రాంతి తీసికోవాలి అన్నారు డాక్టర్లు (వాళ్ళకేం పోయింది?). బరువులు ఎత్తకూడదన్నారు. గిన్నెలు, గరిటలు ఎత్తడం బరువైన పనులు కదా అని మా ఆవిడను పనులు చేయనీయకుండా బంధు మిత్రులు తరచు వంటలు చేసి తీసుకు వచ్చారు. నా పనులు daily menu planning, పదార్థాలు వేడి చేయడం, ప్లేట్లు, ఫోర్కులు డిష్ వాషర్‌లో పేర్చడం, ఇల్లు శుభ్ర పరచడం లాంటివి.

Daily menu planning అంటే ఏ పదార్థాలు ఫ్రిజ్‌లో ఎన్నాళ్లుంటాయి, ఏవి ఎప్పుడు తినాలి లాంటి నిశ్చయాలు. ఎవరన్నా ఫోను చేసి 'వస్తున్నాం, ఏ వంటకాలు పట్టుకు రమ్మంటారు?' అని అడిగితే చెప్పవలసిన జవాబు menu planning లోకి వస్తుంది. మొహమాటం పడకుండా వాళ్ళకి కావలసినవి చెప్పాలి, లేకపోతే మళ్లీ వంకాయో, కేబేజి కూరో వస్తుంది. ఫోను చేసిన భవాని గారిని కాకరకాయ కూర తెమ్మని చెప్పా మా అమ్మ చేసే రెసిపీ ఇచ్చి. మా ఆవిడతో చెప్పాను, 'నీకు కాకరకాయ కూర నచ్చితే మంచిదే, నచ్చక పోతే ఇంకా మంచిది ఇది నాకిష్టమైన కూర కదా!' అని.

సర్జరీ అయిన మూడు వారాల తరువాత మా ఆవిడ క్రింద వంటింట్లోకి వచ్చి భోజనం చెయ్యడం మొదలు పెట్టింది. మొదట్లో రాణివారి లాగ పడక గదిలోనే ఉంటోంటే నేను భోజనం పైకి తీసుకొని వెళ్ళేవాడిని బొత్తిగా పనివాడిలాగ. ఆ పడక గదిలోనే చిన్న ఫ్రిజ్, మైక్రోవేవ్ ఒవెన్, పళ్ళు, పాలు, బ్రెడ్ మొదలైనవి ఏర్పాటు చేశాను.

ఇంకా ముందు సర్జరీ అయిన కొత్తలో కదలడమే కష్టమైంది. మా ఆవిడకు ఎప్పటినించో చేతులు పట్టుకుని షికారు వెళ్ళాలన్న కోరిక సఫలమైంది. హాస్పటల్ కారిడార్స్‌లో నేను చెయ్యి పట్టుకుని నడిపించా, రెండు గంటలకోసారి.

సారస్వత సమూహంలో చదివే రచనలో మా ఆవిడ ఎన్నాళ్ళు రికవరీ అవాలో ఎవరితోను చెప్పవద్దు అనుకున్నాను. కాని రికవరీ అయి, మా ఆవిడ పనికి వెళ్ళడం మొదలు పెట్టిందన్న విషయం అందరికీ తెలిసిపోయింది. ఇక మా కష్టాలు ప్రారంభం అయాయి. బంధు మిత్రులు వంటలు పంపడం మానేశారు. ఫ్రిజ్ కాళీ అయిపోయింది. మా ఆవిడ వంటలు మొదలు పెట్టింది. ఇంట్లో వంట వాసనలు, స్టౌ మీద పడ్డ నూనెలు, సింక్‌లో బోలెడు గిన్నెలు... ఇల్లాంటి ఇబ్బందులు తప్పలేదు. పాపం మా ఆవిడ 'sick leave' అయిపోయింది!

వంటలు చేసిన బంధు మిత్రులకి ఇది అంకితం.

# తెలుగు వారి దేశము

కృష్ణ పెన్న గౌత మి
తుంగభద్ర మంజిర
నదులు అన్ని నిండుగ
ఉరుకులెత్తి గుండెలొ
నాట్యమాడుచుండగ

అలలతోటి పొంగుచు
తూర్పు నున్న సంద్రము
తనను ముద్దు లాడగ

పులకలెత్త దేహము
పొంగిపోవు దేశము
తెలుగు వారి దేశము......

కాళహస్తి తిరుపతి
భద్రగిరియు శ్రీగిరి
ఇంద్రకీల పర్వతం
పెంపుమీరి తామట
శిరములెత్తి నిల్వగ
చెన్ను మీరు దేశము
తెలుగు వారి దేశము.....

పచ్చపచ్చ చేలతో
కంటికింపు జేయుచు
సస్యమెంతొ పండగ
అన్నపూర్ణ తల్లిగ
ఆదరించు దేశము
ఆంధ్రులుండు దేశము...
అందమైన దేశము....

కొండపల్లి బొమ్మలు
ముద్దబంతి గుమ్మలు
నూలు పట్టు చీరలు
మేలు జాతి ఎద్దులు....

కోనసీమ కొబ్బరి
గోగుకూర బచ్చలి
ఆవకాయ పచ్చడి....
ఆంధ్ర భూమి కంతకు
పేరునీయ జగతిని
పేర్మి నొందు దేశము....
తెలుగు వారి దేశము......

కాకతీయ వైభవం
వేంగిరాజ్య ప్రాభవం
గోలకొండ గౌరవం
తెలుగు నాటి తేజమై
వెలిగి పోవు దేశము
తెలుగు వారి దేశము......

బాలచంద్రు పౌరుషం
పాపరాయ సాహసం
రుద్రమాంబ రాజసం
జ్ఞప్తి నుంచి అహరహం
తెలుగు లంత తేజరిల్ల
వెలిగి పోవు దేశము....
తెలుగు వారి దేశము......

అల్లసాని పెద్దన
ముద్దు పలుకు తిమ్మన
పోతరాజు, భీమన
నీతిచెప్పు వేమన....
తెలుగు కవులు యెందరో
తేట తేట మాటల
తీపి కవన మల్లగ...

తిక్కయజ్వ, ఎఱ్ఱన
ఆదికవిగ నన్నయ
ఆంధ్రమందు వ్రాయగ
భారతమ్ము మేటిగ

మధురమైన భాషతో
మధువు లొలుకు దేశము
ముదము కొలుపు దేశము
తెలుగు వారి దేశము......

శిల్పకళల విభవము
చేతిపనుల నిపుణిమ
కుంచె చూపు ప్రతిభలు
ప్రతిఫలించ యెల్లెడ

అన్నమయ్య కీర్తనం
కూచిపూడి నర్తనం
రామదాసు భావనం
తనను చేయ పావనం.....
వేంకటేశుడావల
శ్రీగిరీశు డివల
దుర్గ తల్లి లోపల
దీవనిచ్చి కాయగ......
దీప్తినొందు దేశము
తెలుగు వారి దేశము..
వెలుగు వారి దేశము......

--సుప్రభ
Morristown, NJ